సాక్షి
నంద్యాల
శనివారం, 22, ఫిబ్రవరి, 2025



అదిగదిగో శ్రీశైలం..
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీగిరికి భక్తులు తరలివస్తున్నారు. నల్లమల అటవీప్రాంతంలో పాదయాత్రగా శ్రీశైలం వైపు అడుగులు వేస్తున్నారు. 8లో▸



టమాట రైతుకు కన్నీరే!
పండించిన టమాట పంటకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతుకు కన్నీరే మిగిలింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. 8లో▸



దారి తప్పిన శివస్వాములు
నల్లమల మీదుగా శ్రీశైలం బయలు దేరిన ఏడుగురు శివస్వాములు దారి తప్పారు. అడవిలో తప్పిపోయి సుమారు 4 గంటల పాటు ఆందోళన చెందారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



పంటలను పరిశీలిస్తున్న షేక్ మీరా

బనగానపల్లె: కూరగాయలు, ఆకుకూరలు ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ సాంకేతిక పరిశోధన, అనుప్రయోగ సంస్థ(అటారీ) హైదరాబాద్ జోన్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి అధ్యక్షతన యాగంటిపల్లెలో రైతులు సాగు చేసిన కూరగాయలు ఆకుకూరల పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన దిగుబడులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి రైతులు లాభాలు పొందాలన్నారు. యాగంటిపల్లె పరిసర ప్రాంతంలో మామిడితోటలను సందర్శించి రైతులు చేపట్టిన యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. నేల, మానవాళి ఆరోగ్యం కోసం తప్పకుండా రసాయన రహిత వ్యవసాయ విధానాలపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. ఆయన వెంట సొసైటీ ఏఓ సురేష్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు ఉన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని వివిధ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా రవాణా అధికారి రజియా సుల్తానా తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 24వ తేదీ నుంచి శ్రీశైల క్షేత్రానికి వివిధ డిపోల నుంచి 180 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఆళ్లగడ్డ డిపో నుంచి 15, ఆత్మకూరు నుంచి 50, బనగానపల్లె 10, డోన్ 15, కోవెలకుంట్ల 15, నందికొట్కూరు 35, నంద్యాల డిపో నుంచి 40 బస్సులతో పాటు ఇతర జిల్లాల నుంచి 90 బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. బస్సుల మెయింటెన్స్ కోసం శ్రీశైలం హఠకేశ్వరం, దోర్నాలలో రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. 24 గంటల పాటు ట్రాఫిక్ క్లియరెన్స్, మెయింటెన్స్‌పై నలుగురు ఎస్ఎస్ఓలు, పది మంది డీఎంఎస్, 100 మంది సూపర్ వైజర్లతో బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. అలాగే నంద్యాల డిపో నుంచి మహానందికి 25 బస్సులు, ఓంకారానికి 10, భోగేశ్వరానికి 3, ఆత్మకూరు డిపో నుంచి రుద్రకోడూరుకు 5, సంగమేశ్వరానికి 5, కొలను భారతికి 2, నందికొట్కూరు డిపో నుంచి భోగేశ్వరానికి 2, బనగానపల్లె డిపో నుంచి యాగంటికి 10, డోన్ డిపో నుంచి బ్రహ్మగుండంకు 14, కోవెలకుంట్ల డిపో నుంచి నయనాలప్పకు 6 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తులకు మెరుగైన వసతులు



తాత్కాలిక వైద్యశాలలో వైద్యులకు సూచనలు చేస్తున్న ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన దర్శనం క్యూలైన్లు, శివదీక్షా శిబిరాలు, పార్కింగ్ ప్రదేశాలు, 30 పడకల తాత్కాలిక వైద్యశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లలో నిరంతరం అల్పాహారం, మంచినీరు, బిస్కెట్లు పంపిణీ చేయాలన్నారు. దివ్యాంగులకు, చంటిబిడ్డ తల్లులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. శివదీక్ష శిబిరాలను సందర్శించి, ఏర్పాట్లపై పలువురు భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.

కోర్టుల భవన నిర్మాణాలకు స్థల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: ఐదు అడిషనల్ కోర్టుల భవనాల నిర్మాణానికి ఎమ్మిగనూరు పట్టణంలో స్థలాలను శుక్రవారం జిల్లా జడ్జి కబర్ధి పరిశీలించారు. జూనియర్ సివిల్ కోర్టు భవనాన్ని పునర్నిర్మించేందుకు స్థానిక కోర్టు జడ్జి పి.హేమ, న్యాయవారులతో మాట్లాడారు. తాత్కాలిక కోర్టు ఏర్పాటు చేసేందుకు పట్టణంలో పాత మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించారు. అడిషనల్ కోర్టుల భవన నిర్మాణాలకు పాత తహసీల్దార్ కార్యాలయం, ఆదోని రోడ్డులోని టీబీపీ కార్యాలయం, వెటర్నరీ ఆసుపత్రి స్థలాన్ని పరిశీలించారు. ఏ ప్రాంతం అనువుగా ఉంటుందో తెలియజేయాలని స్థానిక కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులకు, న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక జడ్జి హేమ, తహసీల్దార్ శేషఫణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురురాజారావు, కార్యదర్శి రఘురాం, న్యాయవాదులు మామిడి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఊరు పొమ్మంది.. బతుకు గాయమైంది!

ఉపాధిలో 'పచ్చ'పాతం
- రోజుకు లక్ష మందికి ఉపాధి కల్పించాలనేది లక్ష్యం
- 62వేల మందికి పనులు కల్పిస్తున్నట్లు లెక్కలు
- ఇందులో 50 శాతం వరకు దొంగ హాజరే
- సగటున కుటుంబానికి కల్పించిన పని దినాలు 37 మాత్రమే
- టీడీపీ నేతల కనుసన్నల్లో యంత్రాలతో పనులు

కోసిగి మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 12,770 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 5వేలకు పైగా కుటుంబాలు ఇప్పటికే వలసబాట పట్టాయి. ఆర్లబండ, దుద్ది, వందగల్లు, కోసిగి, ఐరన్‌గల్, పల్లెపాడు, చింతకుంట, కందుకూరు, చిరుతనగల్లు తదితర గ్రామాల నుంచి వందలాది కుటుంబాలు వలస వెళ్లాయి. ఈ గ్రామాల్లో నిర్మానుష్య పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో 26 గ్రామాలు ఉండగా పలు గ్రామాల్లో 50 శాతం పైగా కుటుంబాలు ఊళ్లు విడిచిపెట్టడం గమనార్హం.

గ్రామంలో పనుల్లేకనే వలస



నేను, నా భార్య లక్ష్మి ఏడాది పొడవునా రెక్కల కష్టం మీదనే బతుకుతున్నాం. గ్రామంలో ఉపాధి పనులు పెడతారేమోనని ఎదురు చూశాం. వర్క్ ఐడీలు రాలేదన్నారు. ఇంకా ఆలస్యం కావచ్చన్నారు. దిక్కులేక పిల్లలతో పాటు వలస వెళ్లాం.
– చిరంజీవి, కోతికొండ, తుగ్గలి మండలం

పెట్టుబడి కూడా దక్కలేదు



నాకు 5 ఎకరాల భూమి ఉంది. వర్షాధారం కింద పత్తి సాగు చేస్తున్నా. వర్షాభావం, అధిక వర్షాల వల్ల ఎకరాకు 3 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. పెట్టుబడి కూడా దక్కలేదు. స్థానికంగా ఉపాధి పనులు లేవు. భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి గుంటూరుకు వలస వెళ్లాం.
– సుధాకర్, యాటకల్లు గ్రామం, ఆస్పరి మండలం



వలసబాట పట్టిన వ్యవసాయ కూలీలు, రైతులు



యంత్రాలతో పనులు చేయిస్తున్న దృశ్యం

యంత్రాలతో ఉపాధి పనులు
- ➡ వెల్దుర్తి, తుగ్గలి, మద్దికెర, దేవనకొండ, ఆస్పరి తదితర మండలాల్లో యంత్రాలతో ఉపాధి పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది.
- ➡ ఇటీవలనే వెల్దుర్తి మండలంలోని ఓ గ్రామంలో యంత్రాలతో పనులు చేయిస్తుండగా సీపీఐ కార్యకర్తలు అడ్డుకోవడం కలకలం రేపింది.
- ➡ యంత్రాలతో పనులు చేయిస్తూ దొంగ మస్టర్లు వేసి ఉపాధి నిధులు కొల్లగొడుతుండటం గమనార్హం.
- ➡ నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గంలో లేబర్‌తో చేయించాల్సిన పనులకు యంత్రాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం.

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ సీజను ముగిసింది. ఉపాధి పనులకు సహజంగా జనవరి నుంచి మే నెల వరకు డిమాండ్ ఉంటుంది. ఈ సమయంలోనే 100 శాతం గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాల్సిన అవసరం ఉంది. అయితే సగం పంచాయతీల్లో ఉపాధి జాడ లేకపోవడంతో వేలాది కుటుంబాలకు బతుకు భారంగా మారింది. విధిలేని పరిస్థితుల్లో కటుంబ సభ్యులను వెంట తీసుకొని వలసబాట పడుతున్నారు. తుగ్గలి, పత్తికొండ, మద్దికెర, దేవనకొండ, మంత్రాలయం, కొసిగి, పెద్దకడుబూరు, హొళగుంద, హాలహర్వి, ఆలూరు, ఆదోని, ఆస్పరి మండలాలు అత్యల్ప వర్షపాతం ఉన్న మండలాలు. నంద్యాల జిల్లాలో ప్యాపిలి, డోన్, బేతంచెర్ల తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఈ మండలాల్లో వ్యవసాయం కష్టతరం కావడంతో వలసలు సర్వసాధారణం. గతంలో ఎప్పుడూ లేని విధంగా గత ఏడాది నవంబర్ నెల నుంచే వలసలు మొదలైనప్పటికీ ఉపాధి పనులు కలిపించడంలో జిల్లా యంత్రాంగం విఫలమైంది. 2024–25 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 1.71 కోట్ల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం. ఆర్థిక సంవత్సరం మరో 35 రోజుల్లో ముగియనుంది. ఇప్పటి వరకు కేవలం 1.40 కోట్ల పని దినాలు మాత్రమే కలిపించారు. ఉమ్మడి జిల్లాలో 972 గ్రామ పంచాయతీలు ఉండగా అధికారుల లెక్కల ప్రకారం 90 శాతం పంచాయతీల్లో ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా 50 శాతం పంచాయతీల్లోనే ఉపాధి పనులు జరుగుతుండటం.. ఇది కూడా అరకొరగానే కావడం గమనార్హం.

సగటున 37 కుటుంబాలకే ఉపాధి

జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం కుటుంబాలు 8,87,652. నేటికి ఈ కుటుంబాల సంఖ్య 30 శాతం వరకు పెరిగి ఉంటుంది. 2024–25లో కర్నూలు జిల్లాలో కటుంబానికి సగటున 37 పని దినాలు మాత్రమే కల్పించినట్లు తెలుస్తోంది. నంద్యాల జిల్లాలో కుటుంబానికి 38 పని దినాలు కల్పించినట్ల స్పష్టమవుతోంది.

ఉపాధి కల్పనలో 'పచ్చ'పాతం

ఉమ్మడి జిల్లాలో మొత్తం జనాభా 40.53 లక్షలు. ఇందులో రోజుకు 1.56లక్షల మందికి ఉపాధి కల్పించాలనేది లక్ష్యం. అయితే డిమాండ్ ఎక్కువగా ఉండాల్సిన సమయంలోనూ ఉపాధి 96 వేల మందికి మించని పరిస్థితి. కర్నూలు జిల్లాలో 62 వేలు, నంద్యాల జిల్లాలో 34 వేల మందికి మాత్రమే ఉపాధి లభిస్తోంది. ఇందులోనూ 50 శాతం వరకు బోగస్ హాజరు ఉంటోంది.ప్రస్తుతం ఉపాధి పనులు మొత్తం టీడీపీ నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. మొన్నటి వరకు కేవలం ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే ఉండగా.. నేడు ప్రతి గ్రామంలో ఐదారు శ్రమశక్తి సంఘాలు పుట్టుకురాగా, ప్రతి సంఘానికి ఒక మేట్ ఉన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు టీడీపీ కార్యకర్తలే. ఈ నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా ఉపాధి పనులు కల్పించాల్సి ఉన్నప్పటికీ 'పచ్చ'పాతం చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మండలం	కుటుంబాలు	వంద రోజుల పని దక్కిన కుటుంబాలు
గోనెగండ్ల	14,578	54
నందవరం	12,266	68
క్రిష్ణగిరి	9,780	74

11,052 కుటుంబాలకే 100 రోజుల పని

ఉమ్మడి జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ మార్గదర్శకాల ప్రకారం ఏడాదికి లక్ష కుటుంబాలకు 100 రోజుల పని కల్పించాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరినప్పటికీ కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 5,621 మందికి, నంద్యాల జిల్లాలో 5,431 కుటుంబాలకు మాత్రమే 100 రోజుల పని దక్కింది. సాధించిన ప్రగతి 19 శాతం మాత్రమే.

మా భూమి ఏమైంది మేడం!

- భూ రీ సర్వేలో లోపాలను కలెక్టర్‌కు వివరించిన రైతులు



కలెక్టర్ రాజకుమారికి సమస్యను వివరిస్తున్న రైతులు

ఉయ్యాలవాడ: భూ రీ సర్వే జరిగిన పొలాల విస్తీర్ణంలో తేడా వస్తుండటంతో పలువురు రైతులు కలెక్టర్ రాజకుమారి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్.కొత్తపల్లె గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వేను శుక్రవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ సర్వే ద్వారా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పూర్తి స్థాయిలో ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.కొత్తపల్లె గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని 251 మంది రైతులకు చెందిన 973.40 ఎకరాల విస్తీర్ణంలో సర్వే ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 613 ఎకరాల్లో సర్వే పూర్తయిందన్నారు. గ్రామానికి చెందిన నరసింహుడు అనే రైతు 98 సెంట్ల భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, మరో రైతు రవికుమార్ తనకు ఎకరా ఉంటే 92 సెంట్లు మాత్రమే చూపుతున్నారని, మిగులు 8 సెంట్ల భూమి ఎక్కడికి పోయిందని కలెక్టర్ ముందు వాపోయారు. అలాగే మరి కొంత మంది రైతులు విస్తీర్ణంలో కొలతల్లో తేడాలు వస్తున్నాయన్నారు. సర్వే నెంబర్ 141లో 8.79 ఎకరాల విస్తీర్ణంలో కొలతలు వేస్తుండగా క్షేత్రస్థాయిలో తేడాలు వున్నాయని మండల సర్వేయర్ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ రికార్డులలో ఉన్న వివరాలపై అవగాహన కల్పిస్తూ కొలతల్లో తేడాలు లేకుండా రైతులకు న్యాయం జరిగేలా రీ సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా సర్వేయర్ జయరాజు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధి సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో ఏ మేరకు పనులు జరుగుతున్నాయని, ఎంత మంది కూలీలు పనుల్లోకి వస్తున్నారని ఏపీఓ రవిప్రకాష్‌ను కలెక్టర్ ఆరా తీశారు. 1000 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొనాల్సి వుండగా కేవలం ప్రతి రోజు 500 మంది హాజరవుతున్నట్లు ఏపీఓ చెప్పడంతో మండిపడ్డారు. కూలీల హాజరు పెంచాలని ఆదేశించారు. గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలను నిప్పంటించి పచ్చదనాన్ని నాశనం చేస్తున్న విషయాన్ని కలెక్టర్ గుర్తించి 'మేరేమి చేస్తున్నారు' అంటూ ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చని మొక్కలను నాశనం చేసిన వ్యక్తులను గుర్తించి వెంటనే వారికి నోటీసులు అందజేసి కేసులు నమోదు చేయాలని ఉపాధి, పోలీస్ శాఖను ఆదేశించారు.

కేఆర్‌ఎంబీ కర్నూలులో ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

నంద్యాల(అర్బన్): కృష్ణానది యాజమాన్య బోర్డు (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు)ను విజయవాడలో ఏర్పాటు చేస్తామనే ప్రభుత్వ ప్రకటనపై రాయలసీమ సాగునీటి సాధన సమితి, ప్రజా రైతు సంఘాలు భగ్గుమన్నాయి. కర్నూలులోనే కేఆర్‌ఎంబీని ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం నంద్యాల పట్టణంలోని సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి నివాస గృహం నుంచి గాంధీ చౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు అందించేటప్పుడు ఆ ప్రాంతానికి శ్రీశైలం ప్రాజెక్టుతో అనుబంధం తెగిపోయిందన్నారు. కృష్ణానది యాజమాన్య బోర్డును శ్రీశైలం ప్రాజెక్టు ఉన్న కర్నూలు జిల్లాలోనే ఏర్పాటు చేయాలన్నారు. కేఆర్‌ఎంబీని కర్నూలులో ఏర్పాటు చేయకపోతే సీమ వాసులు తాగు, సాగునీటికి ఇబ్బందులు పడక తప్పదన్నారు. ఈనెల 25వ తేదీలోగా యాజమాన్య బోర్డు మార్పుపై ప్రకటన చేయకపోతే అదే రోజు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నిరసన ర్యాలీలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మార్చి 24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె

కర్నూలు (అగ్రికల్చర్): మార్చి 24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె చేపట్టనున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) నేతలు తెలిపారు. కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బుధవారపేట బ్రాంచ్ ఎదుట శుక్రవారం సాయంత్రం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అన్ని బ్యాంకులకు చెందిన ఉద్యోగులు 400 మంది వరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ నాగరాజు మాట్లాడుతూ.. బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. అన్ని కేడర్‌లలో తగిన నియామకాలు చేపట్టాలని, తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఐడీబీఐ ప్రైవేటీకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు అధికారులు, ఉద్యోగులపై దాడులను అరికట్టేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐబీవోసీ నాయకులు జియాపూర్, రాజు, మురళీకృష్ణ, ఎన్‌సీబీఈ నాయకులు ప్రవీణ్, రవి, నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నివాస గృహాల క్రమబద్ధీకరణ

నంద్యాల(అర్బన్): రెవెన్యూ శాఖ అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో 2019 అక్టోబర్ 15 నాటికి ముందే ఏర్పాటు చేసుకున్న నివాస గృహాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు వరకు గడువు ఉందన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

- ఏపీఈఆర్‌సీ చైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్

నంద్యాల(అర్బన్): లో, హై ఓల్టేజీ సమస్యను అధిగమించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్ ఆదేశించారు. పట్టణంలోని 2020/132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, 33/11 కేవీ ఇండోర్ సబ్ స్టేషన్లను శుక్రవారం ఆయన స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల 2020/132/33 కేవీ సబ్ స్టేషన్ లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం వంద ఎంవీఏ నుంచి 160 ఎంవీఏకు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. నంద్యాల డివిజన్ పరిధిలో అధిక లోడు ఉన్న 33కేవీ ఫీడర్ నుంచి తక్కువ లోడు ఉన్న ఫీడర్‌కు లోడు డైవర్షన్ చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. శిరివెళ్ల ప్రాంతంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఈలు మధుసూదనరావు, బాబు రాజేంద్ర, ఈఈ శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్, ఏడీ రమేష్‌కుమార్, ఏఈ రామయ్య ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్

హరోం..హర..శంకరా..!



హంస వాహనాధీశులైన ఆది దంపతుల ఆలయ ప్రదక్షిణ

- హంస వాహనంపై దర్శనమిచ్చిన ఆదిదంపతులు
- స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పులకించిన భక్తజనం
- నేడు టీటీడీ, కాణిపాకం దేవస్థానం వారిచే మల్లన్నకు పట్టువస్త్రాలు



ఉత్సవంలో బాలికల కేరళ నృత్య ప్రదర్శన



శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీగిరి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లకు హంస వాహనసేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయం సమీపంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో హంస వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను హంస వాహనంపై ఆశీనులను చేసి ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. మంగళవాయిద్యాలు మారుమోగగా, భక్తుల శివన్మామస్మరణతో హంసవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేయించారు. అనంతరం దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు గంగాధర మండపం వద్ద స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు అక్కడి నుంచి బయలువీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో వివిధ కళారూపాలు, డప్పు వాయిద్యాలు, కర్ణాటక నృత్యాలు, డోలు, బీరప్పలు, మహిళల కోలాటం, కళాకారుల నృత్యాలు గ్రామోత్సవానికి మరింత వన్నె తెచ్చాయి. హంస వాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించి ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు.

శ్రీశైలంలో నేడు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు శనివారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లు మయూర వాహనంపై ఆశీనులై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అలాగే ఉదయం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానం, సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే శ్రీశైల మల్లన్నకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.



ఆకట్టుకున్న డ్రమ్స్ విన్యాసం

10 మంది వైద్యులకు షోకాజ్ నోటీసులు

కర్నూలు(హాస్పిటల్): సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన 10 మంది వైద్యులకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో కర్నూలు మెడికల్ కాలేజీలో పనిచేసే ఇద్దరు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విధాన పరిషత్‌లోని సీహెచ్‌సీల్లో పనిచేసే నలుగురు వైద్యులు ఉన్నారు. వీరు ఏడాది కాలంగా సెలవు కూడా పెట్టకుండా విధులకు గైర్హాజరవుతుండటంతో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవిలు ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కొంత మంది నుంచి స్పందన లేకపోవడంతో త్వరలో ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

సప్లిమెంటరీ పరీక్షలకు 62 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు శుక్రవారం 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 551 మందికి 489 హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

మృత కోళ్ల కలకలం



మృతి చెందిన కోళ్లు

ప్యాపిలి:బర్డ్‌ఫ్లూ భయం నెలకొన్న వేళ ప్యాపిలిలో మృతి చెందిన కోళ్లను రోడ్డు పక్కన పడేయంతో కలకలం రేగింది. స్థానిక కలచట్ల బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు వందల సంఖ్యలో మృతి చెందిన కోళ్లను పడేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బర్డ్‌ఫ్లూతో మృతి చెందిన కోళ్లను పడేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన కోళ్లను మట్టిలో పూడ్చి పెట్టాల్సి ఉండగా రోడ్డు పక్కన పడేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాటి నుంచి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బెల్లం ఊట ధ్వంసం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట అటవీ సమీపంలోని మోకాళ్ల కురువ, మామిడిసెల ప్రాంతాల్లో శుక్రవారం రెండు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.రాముడు తెలిపారు. అటవీశాఖ రేంజ్ అధికారి సుభాష్‌రెడ్డి సహకారంతో అటవీశాఖ సిబ్బంది, ఎక్సైజ్ శాఖ సిబ్బంది సంయుక్తంగా దాడులు చేశామన్నారు. నాటుసారా తయారీ కోసం అటవీ ప్రాంతంలో నిల్వ చేసిన బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే శ్రీశైలం, కొత్తపేట, ఎస్టీ కాలనీలో నాటుసారా విక్రయిస్తున్న రమావత్ బద్రునాయక్ వద్ద 4లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌లు ఎస్.కిశోర్‌కుమార్, రామాంజుల నాయక్, సిబ్బంది కృష్ణుడు, బాదుల్లా, మధు, సుధీర్ పాల్గొన్నారు.




బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం



నల్లమల మీదుగా పాదయాత్రగా వస్తున్న భక్తులు



శ్రీగిరికి చేరువవుతూ..



సాక్షిగణపతి ఆలయానికి బారులుదీరిన భక్తజనం

అదిగదిగో శ్రీశైలం..

- నల్లమల అడవుల్లో పాదయాత్రగా తరలివస్తున్న భక్తులు
- మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- జ్యోతిర్ముడి శివస్వాములకు స్పర్శదర్శనం



శ్రీశైల పురవీధుల్లో భక్తజనం

శ్రీగిరిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు తరలివస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో పాదయాత్రగా శ్రీశైలం వైపు అడుగులు వేస్తున్నారు. భక్తుల శివనామస్మరణతో నల్లమల అటవీప్రాంతం మారుమోగుతుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేవస్థానం ఉచిత, రూ.200, రూ.500, వృద్ధులు, చంటి పిల్లల తల్లులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అలాగే భక్తులు వేచిఉండే ఉచిత కంపార్ట్‌మెంట్లలో తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు, పాలు పంపిణీ చేస్తున్నారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కళకళలాడాయి. జ్యోతిర్ముడి కలిగిన శివస్వాములకు చంద్రావతి కల్యాణ మండపంలో నాలుగు కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసింది. అలాగే విడతల వారీగా జ్యోతిర్ముడి కలిగిన శివస్వాములకు మల్లన్న స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నారు. పాతాళగంగమార్గంలోని శివదీక్షా శిబిరాలలో జ్యోతిర్ముడి సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామోత్సవంలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – శ్రీశైలంటెంపుల్



జ్యోతిర్ముడి సమర్పిస్తున్న శివదీక్షా భక్తులు



హంస వాహనాధీశులైన స్వామి వార్లకు పూజలు నిర్వహిస్తున్న పండితులు



ఉత్సవంలో కళాకారుల కోలాటం



ఆకట్టుకున్న వీరభద్ర వేషధారణ

పరమేశ్వరా.. నీ దర్శనం కష్టమాయె!

- క్యూలైన్ల ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం
- తొక్కిసలాటకు అవకాశం ఉండటంతో భయాందోళన



ఆరుబయటే రోడ్డుపై కూర్చున్న శివస్వాములు

శ్రీశైలంటెంపుల్: శివదీక్షా భక్తులకు మల్లన్న దర్శనం కష్టంగా మారింది. ఎంతో భక్తితో 40 జులు శివమాల స్వీకరించిన భక్తులు జ్యోతిర్ముడి సమర్పించేందుకు శ్రీశైలం చేరుకుంటున్నారు. ఈ నెల 23వ తేదీ వరకు మాత్రమే జ్యోతిర్ముడి కలిగిన భక్తులకు మల్లన్న స్పర్శదర్శనం కల్పిస్తుండడంతో శివస్వాములు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. శివస్వాములకు ఏటా ఏర్పాటు చేస్తున్నట్లుగానే చంద్రావతి కల్యాణమండపంలో కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేశారు. అయితే అధికసంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో ఆరుబయటే రోడ్డుపై భక్తులు కూర్చుంటున్నారు. శివస్వాములకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన దేవస్థానం ఆదిశగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. శివస్వాములకు కంపార్ట్‌మెంట్ల నుంచి మల్లన్న దర్శనానికి వెళ్లేందుకు ఒక్క భక్తుడు పట్టే విధంగా క్యూలైన్ ఏర్పాటు చేయడం, దర్శనానికి ఒక్కసారిగా శివస్వాములందరూ రావడంతో అక్కడ తొక్కిసలాట జరిగే అవకాశం ఉంది. ఇలాగేనా క్యూలైన్ ఏర్పాటు చేసేది అని శివస్వాములు మండిపడుతున్నారు. గంటల తరబడి మల్లన్న స్పర్శదర్శనానికి వేచిచూడాల్సిన పరిస్థితి ఎదురవుతుందని భక్తులు ఆవేదన చెందుతున్నారు.

మందుబాబులకు జరిమానా

కర్నూలు: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు పలు ఘటనల ద్వారా వెలుగు చూడటంతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మూడో పట్టణ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి 12 మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. వారందరినీ శుక్రవారం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి రూ.3వేలు, ఓపెన్ డ్రింకింగ్‌లో పట్టుబడిన 11 మందికి ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం



గ్రీవెన్స్ డేలో ఎస్పీకి సమస్యలు చెప్పుకుంటున్న కానిస్టేబుల్

కర్నూలు: పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే(గ్రీవెన్స్ డే) నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లు, వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది హాజరై తమ సమస్యలను చెప్పుకున్నారు. ముఖ్యంగా బదిలీలు, ఆరోగ్య సమస్యలు, విధి నిర్వహణలో తలెత్తుతున్న ఇబ్బందులను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. వాటికి తగిన పరిష్కారం చూపుతానని ఎస్పీ సిబ్బందికి భరోసా కల్పించారు. ఇకపై ప్రతి శుక్రవారం సిబ్బంది సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే నిర్వహిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

ప్రైవేటు బస్సు బోల్తా

- నలుగురు భక్తులకు తీవ్ర గాయాలు



బోల్తాపడిన బస్సు

తుగ్గలి: ప్రైవేట్ బస్సు అదుపు తప్పి బోల్తా పడటంతో నలుగురు భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తుగ్గలి మండలం జొన్నగిరి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. కర్ణాటక, అనంతపురానికి చెందిన 40 మంది యాత్రికులు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు వెళ్లారు. అక్కడి నుంచి కాశీతో పాటు పలు పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం మంత్రాలయంలో స్వామిని దర్శించుకొని అనంతపురానికి బయలుదేరారు. మార్గమధ్యలో గిరిగెట్ల–జొన్నగిరి మధ్య ఓ మలుపులో బస్సు అదుపుతప్పి పొలం పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంతో అనంతపురానికి చెందిన తులసి, యలహంకకు చెందిన పూర్ణిమ, గౌరిబిదనూరుకు చెందిన లక్ష్మయ్య, బ్రహ్మణహాల్‌కు చెందిన ఉమాదేవి తీవ్రంగా గాయపడ్డారు. మరి కొంత మందికి స్వల్ప గాయాలతో బయటపడటంతో పెద్ద ముప్పు తప్పినట్లయింది. జొన్నగిరి ఎస్‌ఐ జయశేఖర్, పోలీసులు, గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను బస్సులోంచి బయటకు లాగారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ పత్తికొండ ఆర్డీఓ వెంకటేష్, రూరల్ సీఐ పులిశేఖర్, ఆర్టీఏ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. క్షతగాత్రులను 108 వాహనాల్లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిషన్‌లో పడి వ్యక్తి మృతి



మృతుడు మాల రాఘవేంద్ర (ఫైల్)

ఆదోని రూరల్: ఆదోని పట్టణ శివారులోని సిరుగుప్ప క్రాస్ రోడ్డులో ఉన్న మహాగౌరీ ఉద్యోగ బయోమాస్ ఫ్యాక్టరీలో మాల రాఘవేంద్ర(43) అనే వ్యక్తి ప్రమాదశవాత్తు మిషన్‌లో పడి మృతిచెందాడు. కడితోట గ్రామానికి చెందిన మాల రాఘవేంద్ర గత పదేళ్లుగా ఫ్యాక్టరీలో పనిచేస్తుండేవాడు. శుక్రవారం పనికి వచ్చి మిషన్‌లో ఉన్న పొట్టును తీస్తుండగా ఇరుక్కుపోయి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేలోపే అక్కడికక్కడే మృతిచెందాడు. మాల రాఘవేంద్రకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు.

తగ్గిన శనగ దిగుబడులు

నంద్యాల(అర్బన్): ఈ ఏడాది అధిక వర్షాలు, ముసురు కారణంగానే శనగ పంట దిగుబడులు తగ్గాయని డీఏఓ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శుక్రవారం ఏడీఆర్ డాక్టర్ జాన్సన్ అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో డీఏఓ మాట్లాడుతూ శనగ పంటలో ఎన్‌బీఈజీ 810 రకం రైతుల మన్నన పొందుతుందని, ఆ రకం సాగుతో రైతులు అత్యధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. శనగ పంట సాగుకు ముందు నేలను ఖాళీగా ఉంచరాదని, సోయాబీన్స్, మొక్కజొన్న, సజ్జ పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు వ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

టమాట రైతుకు కన్నీరే!

- మార్కెట్‌లో పడిపోయిన ధర
- క్వింటాకు వస్తున్నది రూ.100 నుంచి రూ.200 వరకే!
- టమాటాలను పొలాల్లోనే వదిలేస్తున్న వైనం
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



కర్నూలు(అగ్రికల్చర్): పండించిన పంటకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో టమాట రైతుకు కన్నీరే మిగిలింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో టమాట సాగు పెరిగింది. దిగుబడులు భారీగా వస్తున్నాయి. వీటికి తోడు చత్తీస్‌ఘడ్, మహారాష్ట్రల్లో పండిన టమాట కూడా వస్తోంది. దీంతో ఉన్నట్టుండి ధరలు పడిపోయాయి.

నష్టమే మిగిలింది

టమాట క్రయవిక్రయాలకు పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రధాన ఆధారం. ఇటీవల మార్కెట్‌లో క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. దీంతో దళారీలు అతి తక్కువ ధరకు టమాట కొనడం మొదలుపెట్టారు. కనిష్ఠంగా క్వింటాకు రూ.100/200 వరకు ధర లభిస్తోంది. గరిష్ఠంగా క్వింటాకు రూ.600 వరకు ధర వస్తోంది. ఈ ఏడాది టమాట సాగు చేసిన రైతులు ఒక్కరంటే ఒక్కరు కూడా లాభాలు పొందిన దాఖలాలు లేవు. వంద శాతం మంది అన్నదాతలు నష్టాలు మూట కట్టుకున్నారు.

బిల్లేకల్లులో రైతులకు నిరాశే!

పత్తికొండ, ఆస్పరి మండలం బిల్లేకల్‌లో టమాట పంటను నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. జిల్లా అధికారులు పత్తికొండకు వెళ్లి క్వింటాకు కనిష్ఠంగా రూ.400, గరిష్ఠంగా రూ.1000 ధర ఇచ్చి నామమాత్రంగా టమాటను కొనుగోలు చేసినట్లు సమాచారం. అయితే బిల్లేకల్ మార్కెట్ వైపు కన్నెత్తి చూడా లేదు. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అయితే సాయంత్రం ఆలూరు నియోజకవర్గం టీడీపీ నేత వీరభద్రగౌడు బిల్లేకల్ చేరుకొని రైతులతో మాట్లాడారు. జిల్లా అధికారులు ఇక్కడికి వచ్చి టమాట కొనే అవకాశం లేదని, శనివారం నుంచి పత్తికొండ మార్కెట్‌కు తీసుకెళ్లండని చెప్పడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. చివరికి దళారీలకు క్వింటా కనిష్ఠంగా రూ.200, గరిష్ఠంగా రూ.500 వరకు కొనుగోలు చేశారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో టమాట సాగు వివరాలు..	
జిల్లా	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
కర్నూలు	1,250
నంద్యాల	450
మొత్తం	1700

పొలాల్లోనే పంట

ఆదోని, ఆస్పరి, కర్నూలు రూరల్, కోడుమూరు, దేవనకొండ, వెల్దుర్తి, తుగ్గలి, కల్లూరు, ఓర్వకల్లు, గూడూరు, గోనెగండ్ల మండలాలు, నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో టమాట సాగైంది. ధరలు లేక రైతులు టమాటాను పొలాల్లోనే వదిలేసున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు టమాట రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంది. ప్రతి ఏటా రైతుల నుంచి నేరుగా ప్రభుత్వం టమాటను కొనుగోలు చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత డిసెంబరు నెలలో తూతూ మంత్రంగా 100 టన్నుల వరకు కొనుగోలు చేసింది. తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వం పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు శ్రీకారం చుట్టగా.. కూటమి ప్రభుత్వం దానికి ఉరి వేసింది. సోలార్ డ్రైయర్లను పూర్తిగా పక్కన పెట్టింది.

శ్రీశైలంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి



శ్రీశైలం: శ్రీశైలంలో శుక్రవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. డాక్టర్లు తెలిపిన వివరాల మేరకు.. క్షేత్ర సమీపంలో రోడ్డు పక్కన స్పృహ కోల్పోయి పడిపోయి ఉన్న వద్ధుడిని స్థానికులు శుక్రవారం ఉదయం దేవస్థానం ఉచిత వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి వృద్ధుడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ప్రసాద్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమలలో దారి తప్పిన శివస్వాములు

- గూగుల్ మ్యాప్‌తో వెళ్తూ అడవి లోపలికి వెళ్లిన వైనం
- రక్షించిన ఆత్మకూరు అటవీ సిబ్బంది



దారి తప్పిన శివస్వాములతో రక్షించిన అటవీ సిబ్బంది

ఆత్మకూరు రూరల్: శ్రీశైల శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు నల్లమల మీదుగా పాదయాత్రగా బయలుదేరిన ఏడుగురు శివస్వాములు అడవిలో దారి తప్పారు. సుమారు 4 గంటలు అడవిలో తప్పిపోయి ఆందోళన చెందారు. ఎట్టకేలకు ఆత్మకూరు డివిజన్‌లోని ఇందిరేశ్వరం బీట్ అటవీ శాఖ సిబ్బంది వారిని రక్షించారు. తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెంట్లవెల్లికి చెందిన ఏడుగురు శివస్వాములు ఆత్మకూరు సమీపంలోని వెంకటాపురానికి శుక్రవారం సాయంత్రం వాహనంలో చేరుకున్నారు. అక్కడి నుంచి అటవీ మార్గం మీదుగా శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. వారు అడవిలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన సూచికల బోర్డుల చూపిన దారి గుండా వెళ్లకుండా గూగుల్ మ్యాప్ చూస్తూ వెళ్లడంతో అడవిలో వారు దారి తప్పారు. దట్టమైన అడవి కావడంతో ఎటుపోతున్నారో తెలియక సుమారు 4 గంటల పాటు దిక్కు తోచక తిరిగారు. చివరకు దారి తప్పినట్లు 100కు డయల్ చేసి చెప్పారు. సమాచారం తెలుసుకున్న నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెంటనే ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబాను అప్రమత్తం చేశారు. దీంతో ఆయన సూచన మేరకు ఇందిరేశ్వరం బీట్ ఎఫ్ఎస్ఓ మగ్బూల్, ఎఫ్‌బీవో మద్దిలేటి సిబ్బంది సహాయంతో దారితప్పిన యాత్రికుల కోసం అన్వేషించారు. ఎట్టకేలకు పాదయాత్రికులను గుర్తించిన అటవీ సిబ్బంది వారిని ఆత్మకూరు డీఎఫ్ఓ కార్యాలయానికి తీసుకొచ్చారు. తమను రక్షించిన అటవీ సిబ్బందికి శివస్వాములు కృతజ్ఞతలు తెలిపి బస్సులో శ్రీశైలం బయలుదేరారు.

పోస్టుల భర్తీలో నకి‘లీలలు’

- నాడు ఎస్సీ.. నేడు బీసీగా మారిన వైనం
- 257 నుంచి 352కు పెరిగిన మార్కులు
- ఫైనల్ మెరిట్ లిస్టులో రెండో స్థానానికి చేరిన అభ్యర్థి



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పలు ఉద్యోగాలకు సంబంధించిన పోస్టుల భర్తీ విషయంలో అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. గతంలోనూ ఈ కార్యాలయంలో వివిధ కేటగిరీల్లో పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా పలువురు అభ్యర్థులు ఏకంగా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి మెరిట్ సాధించారు. ఇందులో కొందరు పట్టుబడగా మరికొందరు ఉద్యోగాలు సాధించారు. తాజాగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ విషయంలో ఇలాంటి ఉదంతమే మరొకటి బయటపడింది.

వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫిర్యాదు

వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతి కింద ఐదు ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టుల భర్తీ కోసం గత జనవరి 16వ తేదీన అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఐదు పోస్టులకు గాను ఏకంగా 800లకు పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో రెండుసార్లు ఉద్యోగానికి దరఖాస్తు చేసి నిరాశపడ్డ ఓ నిరుద్యోగి ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలని భావించినట్లు ఉన్నాడు. ఈ మేరకు ఏకంగా రిజర్వేషన్‌తో పాటు మార్కులూ మార్పించుకున్నాడు. ఈ మేరకు దరఖాస్తులను సమర్పించి మెరిట్‌లిస్ట్‌లో అగ్రభాగానికి ఎగబాకాడు. ఇతని మాదిరిగానే పలుమార్లు ఉద్యోగాలకు దరఖాస్తు చేసే కొందరు అభ్యర్థులు ఈ ఉదంతాన్ని గమనించి శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. శాంతికళకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

అతని పేరు ఆ రెండు జాబితాలో ఆమడదూరం

ఎన్.అచ్చన్న అనే 30 ఏళ్ల నిరుద్యోగి 1992 జూన్ 15న జన్మించాడు. రిజర్వేషన్ కేటగిరి రీత్యా అతను ఎస్సీ. డీఎంల్యాబ్‌టెక్నీషియన్ కోర్సు పూర్తి చేశాడు. ఈ మేరకు అతను వైద్య ఆరోగ్యశాఖలో గత నాలుగేళ్లుగా తరచూ వెలువడే నోటిఫికేషన్‌ల ద్వారా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంటూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటూ వస్తున్నాడు. ఈ మేరకు 2023 నవంబర్ 21న ఆదోని మెడికల్ కాలేజీలో డీఎంఈ అధ్వర్యంలో నోటిఫికేషన్ విడుదల కాగా ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నాడు. అలాగే స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు సైతం ఏడాది క్రితం విడుదల చేసిన నోటిఫికేషన్‌లోనూ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు. రెండుసార్లు విడుదల చేసిన మెరిట్‌లిస్ట్‌లో ఇతని పేరు ఆమడదూరంలో ఉంది. అయితే ఈ రెండు నోటిఫికేషన్‌కు సంబంధించిన ఇప్పటి వరకు పోస్టులూ ఇప్పటి వరకు భర్తీ చేయలేదు.

మార్కులు ఎగబాకాయి

గత జనవరి 16వ తేదిన వైద్య ఆరోగ్యశాఖ ల్యాబ్‌టెక్నీషియన్‌తో పాటు ఎఫ్ఎన్‌వో తదితర పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఎన్.లక్ష్మన్న ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నాడు. వందల కొద్దీ దరఖాస్తులను ఉద్యోగులు అతి తక్కువ సమయంలో స్క్రూటినీ చేసి ఫైనల్ మెరిట్ జాబితాను విడుదల చేశారు. మొదటి రెండు నోటిఫికేషన్‌లలో ఎక్కడో ఉన్న లక్ష్మన్న పేరు ఏకంగా రెండో స్థానానికి ఎగబాకడం కొందరు గమనించారు. వెంటనే అతని వివరాలు పరిశీలించడంతో ఆశ్చర్యకర మార్పులు వారికి కనిపించాయి. మొదటి రెండు నోటిఫికేషన్‌లలో ఎస్సీగా ఉన్న అతను ఈసారి బీసీ–బీగా మారాడు. మార్కులు సైతం మొదట 257 ఉండగా ఇప్పుడు ఏకంగా 352కు చేరుకున్నాయి. దీంతో ఖంగుతిన్న అభ్యర్థులు శుక్రవారం డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ మాట్లాడుతూ అభ్యర్థులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేయిస్తామన్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలే వెలుగుచూసినట్లు తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు.

కొనసాగుతున్న నకిలీ సర్టిఫికెట్ల దందా!

జిల్లాలో నకిలీ సర్టిఫికెట్ల దందా కొనసాగుతోంది. గతంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కేంద్రంగా 50కి పైగా నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు బయటపడ్డాయి. ఈ విషయం వెలుగులోకి రావడంతో అప్పటి అధికారులు ముగ్గురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారు. ఇందులో ఒకరు తిరిగి మళ్లీ ఇదే ఆసుపత్రిలో ఉద్యోగం సంపాదించాడు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నిర్వహించిన పలు నోటిఫికేషన్లు, ప్రభుత్వ సర్వజన వైద్యశాల విడుదల చేసిన పలు నోటిఫికేషన్‌ల సందర్భంగా పలువురు అభ్యర్థులు కుల ధ్రువీకరణ, మార్కుల జాబితా, చదివిన కోర్సు తదితరాలకు సంబంధించి నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు వెల్లడైంది. వారి వివరాలు అధికారుల చెంత ఉన్నా వారు తిరిగి రాకపోవడంతో అధికారులు ఫిర్యాదు చేయకుండా వదిలేశారు. ఇందులో కొందరు అభ్యర్థులు ఉద్యోగాలు కూడా అప్పట్లో సాధించారు. గత నెలలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇచ్చినట్లుగా ఏకంగా ముగ్గురికి నకిలీ బర్త్ సర్టిఫికెట్లు బయటపడ్డాయి. ఈ విషయంపై పోలీసులకు అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. తాజాగా మరో నకిలీ సర్టిఫికెట్ బాగోతం బయటపడింది. నకిలీ సర్టిఫికెట్లు ఎవరు, ఎక్కడ ఇస్తున్నారో కనిపెట్టి వారిని శిక్షించాల్సిన అధికారులు, పోలీస్ వ్యవస్థ పట్టించుకోవడం లేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

